# ఔదార్యం


డా. ఎం. వి. రమణారెడ్డి

**ఖాజామియా గడపలో అడుగుపెట్టే అవసరం తనకు కలుగుతుందని మూర్తి కలలో కూడా ఊహించలేదు. ఇతర ప్రపంచంతో నిమిత్తం లేకుండా బ్రతికే మూర్తికి ఇది ఇరకాటమైన సమస్యగా తయారైంది.**

ఖాజామియా లక్షాధికారి. సంఘంలో అతని పలుకుబడికి తిరుగు లేదు. అతని ప్రాపకం కోసం రాజకీయ నాయకులు పడిగాపులు కాస్తారు. అతని విందులకు అధికారులు ఇతర పనులు వాయిదా వేసి హాజరౌతారు. అతని మామూళ్ళ కోసం ఉద్యోగస్తులు తహతహలాడిపోతారు. గవర్నమెంటు జీతమైనా ఆలస్యమవుతుందేమో గాని, మియా మామూళ్ళు గతి తప్పకుండా నెలాఖరుకు అందుతాయి.

ఖాజామియాను శాసించే సాంఘిక హోదా మూర్తికి లేదు. అతడు ఆ ఊరి కాలేజీలో సైన్సు పాఠాలు చెప్పుకునే లెక్చరరు. మధ్యతరగతి కుటుంబీకుడు. పాఠాలు బాగా చెబుతాడని ఊర్లో మెచ్చుకుంటారు. ట్యూషన్ కోసం ఇంటి దగ్గరికొచ్చే విద్యార్థులకు అన్ని అంశాల్లో మంచి తర్ఫీదు ఇస్తాడు. ఫీజు పుచ్చుకోడు. ప్రతిఫలం ఇవ్వకుండా చదువుకోవడం ఇష్టం లేక కలవారి అబ్బాయిలు మూర్తి ట్యూషనుకు రారు.

ఖాజామియా కొడుకు ఆ సంవత్సరం కాలేజీలో చేరాడు. మియా కుటుంబంలో అక్షరం ముక్కలు వచ్చిన మొదటి వ్యక్తి ఆ కుర్రాడే. సంతకం చెయ్యడం



నేర్చుకున్నాడే తప్ప మియాకు చదువు రాదు. దుర్భరమైన బాల్యం అతన్ని చదువు దరిదాపులకు పోనివ్వలేదు. పన్నెండేళ్ళ వయసులో తండ్రి చనిపోయాడు. తల్లి, ఇద్దరు తమ్ముళ్లు, ముగ్గురు చెల్లెండ్లు గల కుటుంబం అతని వీపున పడింది. జీవిత పోరాటంలో ఎన్ని తిప్పలు పడ్డాడో ఆ పరమాత్మునికే ఎరుక! ఢక్కా ముక్కీలు తిని ప్రపంచాన్ని చదివి నేర్చుకున్నాడు. రెండు చేతులా సంపాదించాడు. ఇద్దరు చెల్లెళ్లకు, ఒక్కగానొక్క తమ్ముడికి దర్జాగా పెళ్ళి చేశాడు. 'మియా మహల్' మేడ కట్టించి కాపురమున్నాడు. ఎదురైన ప్రతి మనిషి 'సలాం బడే ఆద్మీ' అని గౌరవించే స్థాయికి ఎదిగాడు.

నడమంత్రపు సిరిని నిరంతరం వెన్నంటి వచ్చే దర్పం మియాను ముట్టడించలేదు. చిన్ననాటి అనుభవాలు అతని హృదయం నుంచి తొలగిపోలేదు. బీదాబిక్కీ జనానికి దానం చేయడంలో అంతటివాడు ఈ కాలంలో ఉండు అనిపించుకున్నాడు. పేద విద్యార్థులకు ఫీజులు కట్టి చదివించాడు. గుడిసెవాసులకు పెళ్ళిళ్ళు చేయించాడు. దిక్కులేని రోగులకు చికిత్స చేయించాడు. ఇల్లు తగలబడితే బట్టలు కొనిపెట్టాడు. ఆ చుట్టుపక్కల పది గ్రామాల్లో పేద జనానికి ఏ కష్టమొచ్చినా ఖాజామియా కోసం పరిగెడతారు.

దాన ధర్మాల్లో ఖాజామియాకు మత భేదం లేదు. "నా వ్యాపారంలో వచ్చే డబ్బు అన్ని మతాలవారిది ఉంది. డబ్బుకు మతం లేనప్పుడు దానానికి మతం ఉంటుందా?" - ఇది ఖాజామియా తర్కం.

లోకం ఆకాశానికెత్తినా ఖాజామియా పట్ల మూర్తికి సదభిప్రాయం లేదు. 'పాములన్నిటికీ కోరలుంటాయి. కొన్నిటి తలపైన మణులుంటాయి. మణి ఉన్నా లేకపోయినా పాము పామే' నంటాడు మూర్తి. మియాను ఆశ్రయించే అవసరం అతనికి ఇంతవరకు కలుగలేదు. ఒకవేళ కలిగినా వెళ్ళడు. అలాటి మూర్తి ఖాజామియా ఇంటికి వెళ్ళవలసిన అవసరం ఏర్పడింది.

మూర్తి పట్ల మియాకు అమితమైన గౌరవం. దానికి కారణం పేదవాడనే జాలి కావచ్చు. మూర్తి ఆత్మాభిమానంపై మెప్పుదల గావచ్చు. విద్యార్థులను లొంగదీసే వ్యక్తిత్వం గావచ్చు. ఉచితంగా ట్యూషన్ చెప్పే అతని ఔదార్యం గావచ్చు. కారణం ఏదైనా ఖాజామియాకు మూర్తిపైన చెప్పలేనంత గౌరవం. మూర్తి కనబడితే వినయంగా ఎదురొస్తాడు. ఆఫీసర్లతో సలాములు పొందే మనిషి మూర్తికి నమస్కారం చేస్తాడు. "బాగున్నారా సాబ్" అంటూ పలకరిస్తాడు. అంతే! అంతకంటే చనువు తీసుకోడు. అందుకే తన మాట తోసిపుచ్చడనే నమ్మకం మూర్తిలో ఒకవైపు మెదలుతూంది.

ఖాజామియా తన కాళ్ళ దగ్గర బ్రతిమాలుతూ కూర్చున్న రోజు నిర్దాక్షిణ్యంగా అతన్ని తిరస్కరించి పంపిన సంఘటన మూర్తి గుండెల్లో ములుకులా గుచ్చుకుంది. తన అనుమతి కోసం కాచుకొని కూర్చున్న అతని చూపుల్లో దీనత్వం గుర్తుకొచ్చి మూర్తికి గుండెలు పిండినట్లయింది. ఆ రోజు తాను ఎందుకంత కఠినంగా ప్రవర్తించాడో మూర్తికి స్ఫురించలేదు. మరేదైనా విషయం మీద చిరాకుగా ఉన్నప్పుడు వచ్చాడా? అతడంటే తన అంతరంగంలో దాగిన చులకన భావం అనుకోకుండా పెల్లుబికిందా? ఏమో! రెండూ కలిసి అలా పలికుండొచ్చు.

* * *

వేసవి దాటిపోయినా ఎండల ప్రభావం తగ్గలేదు. దేశంలో చివరగా చల్లబడేవి. ఢిల్లీ రాజధాని, కడప జిల్లా. మధ్యాహ్నం మూడు గంటలకు బస్సు దిగి ఇంటికి వెళుతున్న మూర్తికి ఒళ్లంతా చీమలు పారాడినట్లుంది. అతడు ఊరుదాటి పరాయి చోటుకు వెళ్ళడం అరుదు. తన వద్ద చదువుకున్న అబ్బాయి తిరుపతిలో పెళ్ళి పెట్టుకున్నాడు. వచ్చితీరాలని మూర్తిని బలవంతం చేశాడు. తన కోసమే ఆదివారం ముహూర్తం పెట్టించానని బ్రతిమాలాడు. మూర్తి ఒప్పుకోక తప్పలేదు. ఆదివారం తెల్లవారుజామున ముహూర్తం. శనివారం రాత్రి బయలుదేరాడు. ఎంత తొందరగా ముగించుకొని వద్దామన్నా బయటపడే వేళకు పది గంటలు దాటింది. అలవాటు తక్కువైనందువల్ల ప్రయాణం చికాకుగా ఉంది.

వీధి మలుపు తిరుగుతుండగానే ఎనిమిదేళ్ళ చిన్న కొడుకు పరుగెత్తుకుంటూ ఎదురొచ్చాడు. ఎక్కడుండి కనిపెట్టాడో ఏమో, 'నాన్నొస్తున్నాడు, నాన్నొస్తున్నాడు' అని కేరింతలు కొడుతూ, దగ్గరికొచ్చి చెయ్యి పట్టుకున్నాడు. పెళ్ళిలో ఇచ్చిన తాంబూలం సంచిని మూర్తి వాడికి అందించాడు. వాడు తండ్రి చెయ్యి విడిచిపెట్టి సంచి తెరిచి చూశాడు. అందులో కనిపించిన అరటిపండును అక్కడే తినటానికి జడిసి సంచిని మడత పెట్టాడు. ఇల్లు చేరితే పండు తనదేనన్న ధీమాతో తండ్రి వెంట నడిచాడు.

ఇంటి దగ్గర విద్యార్థులెవరూ లేరు. తాను ఊళ్లో లేడని తెలుసుగాబట్టి ఎవరూ వచ్చి ఉండరు. వరండాలో అతని తల్లీ, పెద్ద కూతురు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. మూర్తి పడక కుర్చీ ఖాళీగా యథా స్థానంలో ఉంది. అతడు లేకున్నా దానిమీద ఎవరూ కూర్చోరు.

మూర్తి పెద్ద కూతురు ఇంటర్ చదువుతూంది. ఫైనల్ పూర్తిచేస్తే పై చదువుకు పంపాలని అతని ఉబలాటం. అతని తల్లి పెళ్ళి సంబంధాలు వాకబు చేస్తూ ఉంది. "మంచం ఉన్నంతే కాళ్ళు చాపుకోవడం మంచిదిరా నాయనా" అంటుంది.

ఆఅమ్మాయి తరువాత మూడేళ్ళకు మూర్తికి మగసంతానం కలిగింది. ఇంటిల్లిపాదికి వాడి మీద వల్లమాలిన మమకారం. అభిమానం ప్రదర్శించకుండా ఎంత దాచాలన్నా మూర్తికి సాధ్యపడలేదు. దీనివల్ల వాడికి మంకుతనం చిన్నప్పటి నుంచి అలవాటైంది. అదృష్టం కొద్దీ వాడు చదువులో మొద్దు గాలేదు.

'గౌతం' అని పేరు పెట్టినందుకు ఇటు మూర్తిని, అటు బుద్ధుని అప్రతిష్ఠపాలు చెయ్యకుండా మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు. ఇంటర్ వరకు గౌతం చదువు మూర్తికి భారం గాదు. ఎప్పుడో రాబోయే కష్టానికి ఇప్పటి నుంచి దిగులు పడటం మూర్తి స్వభావం కాదు.

"అమ్మా, నాన్నొస్తున్నాడే" కూతురు లేచి ఇంట్లోకి వర్తమానం మోసుకెళ్ళింది.

"ప్రయాణం సుఖంగా సాగిందా అబ్బాయ్?" తల్లి అడిగింది.

"ఆ. బాగానే సాగిందమ్మా." జవాబిస్తూ మూర్తి ఇంట్లోకి జొరబడ్డాడు. ఎదురుగా వచ్చిన భార్య అనసూయతో వేడినీళ్ళు పెట్టమని గదిలోకి వెళ్ళాడు.

"పెళ్ళికూతురు ఎలా వుంది" వేడినీళ్ళు తోడుతూ అడిగింది అనసూయ.

"నీ కళ్లతోనే చూస్తే బావుండేది." సబ్బు కోసం వెదుకుతూ జవాబిచ్చాడు మూర్తి.

మూర్తి ఆశ్చర్యపోయాడు. "మనతో అతనికేం పనబ్బా?" ఆలోచనతో తల వంకరగా తిప్పి స్వగతంలా అడిగాడు.

'నాకేం తెలుసు' అన్నట్టు ఆమె పెదవి విరిచింది. మూర్తి స్నానం చేసే కార్యక్రమంలో పడిపోవడంతో ఆమె వంట గదికి వెళ్ళిపోయింది.

అర్ధ పంచె చుట్టుకొని, భుజాల మీద తుండుగుడ్డ కప్పుకొని మూర్తి వరండాలో పడక కుర్చీ మీద కూర్చున్నాడు. స్నానం చేసిన తరువాత బడలిక తీరింది. భార్య కాఫీ ఇచ్చింది. కాఫీ తాగిన తరువాత మరింత కుదురుగా వున్నట్టు అనిపించింది.

అంత తొందరగా ఎలా తెలిసిందో ఏమో, ఖాజామియా స్వయంగా నడిచొస్తూ కనిపించాడు. అతనికి కారుంది. ఎందుకో కారు తీసురాలేదు. రిక్షావాళ్ళూ ఆటోవాళ్ళూ అతన్ని భూమి మీద అడుగు మోపనివ్వరు. అయినా ఎందుకో నడిచొస్తున్నాడు. ఏ రోడ్డు వార నిలబడినా జనాన్ని గుంపులు గుంపులుగా ఆకర్షించే వ్యక్తి ఎందుకో ఒంటరిగా వస్తున్నాడు. మూర్తిని చూడగానే చేతులెత్తి నమస్కారం చేశాడు. వీధిలో మెట్ల పక్కన చెప్పులు విడిచి వరండాలో ప్రవేశించాడు. మూర్తి ఎదుట నేలమీద వినయంగా కూర్చున్నాడు.

"మా పిల్లోడు మీ కాలేజీలో చేరినాడు సాబ్." ఖాజామియా మెత్తగా పలకరించాడు. ఆ మాటకు, మూర్తి తేరుకున్నాడు. జవాబు ఏం చెప్పాలో తోచక, "అట్లనా?" అన్నాడు. అతని పలుకు నిర్వికారంగా వుంది.

"వాడు మీ క్లాసులోనే ఉండాడు సాబ్." మియా మరికొంత కదిలించాడు.

కొత్త విద్యార్థులతో మూర్తికి ఇంకా పరిచయం ఏర్పడలేదు. మరబొమ్మలా "అవునా?' అన్నాడు.

ముగ్గురు ఆడపిల్లల తరువాత ఖాజామియాకు ఒక్కడే కొడుకు. తనలా కాకుండా అతన్ని బాగా చదివించాలని మియా పట్టుదల. చదువుకున్న వాళ్ళు తన ముందు గులాములకంటే హీనంగా సలాములు చేయడం చూస్తున్నా మియాకు చదువు మీద గౌరవం తగ్గలేదు. ఖరీదైన చదువు చెప్పించగల స్తోమత వున్నా కొడుకును పట్నం పంపలేదు. ఒక్కగానొక్క కొడుకును చూడకుండా వుండటం చేతగాక ఇంతవరకు ఊర్లోనే చదివించాడు. ఇంటర్లో మంచి తర్ఫీదు ఇప్పించి డాక్టరు కోర్సుకు పంపాలని అతని కోరిక. అది నెరవేరాలంటే కొడుకును మూర్తికి అప్పగించాలి.

"వాడు మీ బిడ్డ సాబ్. మీ చేతుల్తో పైకి తేవా సాబ్." మియా ప్రాధేయపడుతూ అడిగాడు.

అతని అభ్యర్థన దేని కోసమో మూర్తికి స్పష్టంగాలేదు.

"వానికి ప్రైవేటు చెప్పండి సాబ్."

వినయంగా చెబుతూ ఖాజామియా తన కుడి చెయ్యి పక్క జేబులోకి పోనిచ్చాడు. జేబునుండి తమలపాకులు బయటికి తీశాడు. వక్కల కోసం జేబుఅడుగున కొనవేళ్లతో తారాడి పట్టుకున్నాడు. వీటితో పాటు ఐదు నూరు రూపాయల నోట్లు బయటికి తీశాడు. వక్కలూ, నోట్లూ వుంచిన తాంబూలం రెండు చేతులతో మూర్తి వైపు సాచాడు.

నోట్లు కంటపడగానే మూర్తిలో ఆత్మాభిమానం భగ్గుమంది. అందర్నీ ఖరీదు చేసినట్లే ఖాజామియా తనను గూడా ఖరీదు చేయడానికి వచ్చినట్లు అనిపించింది.

"ఖాజామియా! నేను మంచితనాన్ని అమ్ముకొని

